# నిమిషాలు - అనుభూతులు

వెలుతురు చీకటిగా మారిపోతోంది.

ఏడు గంటల ముప్ఫయినాలుగు నిమిషాలకి ఇంకా నాలుగు నిమిషాలు తక్కువ.

టాక్సీ చెడిపోయింది.

ఇంకా నాలుగు నిమిషాల్లో ఏడూ ముప్ఫయి నాలుగు అవుతుంది.

టాక్సీ ఇంకా బాగుపడలేదు.

ఎవరో వెంట తరుముతున్నట్లుగా మాలతి చేతి గడియారంలో పెద్దముల్లు పరుగెత్తుతోంది. సెకండ్లముల్లు గిరగిర తిరిగి పోతోంది.

గడియారం చెడిపోలేదు గాని టాక్సీ చెడిపోయింది. టాక్సీ బాగుపడి గడియారం చెడిపోయినా బాగుండేది. సరిగా

ఏడూ ముప్ఫయి నాలుగికి రైలు ప్లాట్‌ఫారం విడిచిపోతుంది. పెద్దముల్లు జరుగుతూనే వుంది.

తనకోసం రైలు ఆగదు. సుందర్రావు ఆగడు.

రైలు టైముకే వొస్తుందా. వొచ్చినా టైముకే పోతుందా. ఈరైలు రోజూ లేటే. కాని ఇవాళ మాత్రం లేటు కాదు. తనకి తెలుసు.

మాలతి నిస్పృహతో నిట్టూర్పు విడిచింది.

అరగంట కిందట టాక్సీ చెడిపోయింది.

ప్రతి నిమిషం అది బాగుపడుతుందని మాలతి అనుకుంటూ ఆశ పడుతూనే వుంది. నిమిషాలు గడిచాయి వ్యర్థంగా... మాలతి ఆశ కూడా క్షణక్షణం వ్యర్థమైంది. నడిచిపోతే బావుండునని అరగంటకిందట ఆమె అనుకుంది. ఇరవై అయిదు నిమిషాల కిందట, ఇరవై — పది హేను ... పది నిమిషాల కిందటి దాకా ... అలాగే అనుకుంది. కాని నడిచి పోలేదు. నడిచినా టైముకి చేరుకోటం కష్టం. మధ్యలో బండి దొరికితే చేరుకోవచ్చు. దొరుకుతుందో, దొరకదో చెప్పటం కష్టం. అలాంటప్పుడు నడిచిమాత్రం ఏంలాభం అనుకుని ఆమె అక్కడే కారులో అలాగే కూర్చొని ఆశిస్తూ నిమిషాలు లెక్కపెట్టుకో సాగింది.

ఉన్నట్టుండి టాక్సీ ఇంజన్ స్టార్టయింది.

గడియారం చెడిపోలేదు.

టాక్సీ వాయువేగ మనోవేగాలతో కాలంతో పందెం వేస్తూ పరిగెత్త సాగింది. మలుపు తిరిగి స్టేషన్ రోడ్ సమీ

పించేసరికి మాలతి కళ్ళు బెదురుచూపులు చూసి చెదిరి పోయాయి. ఎఱ్ఱదీపం జిగేలుమంది. గేటుతలుపులు మూసి వున్నాయి. టాక్సీ ఓడిపోయినట్లు తెలుసుకొని ఆగిపోయింది. గభాలున తలుపు తెరుచుకుని మాలతి గేటుదగ్గరికి పరిగెత్తింది. ప్యాసెంజర్ ప్లాట్‌ఫారం దాటి పొగలు కక్కుతూ గేటు సమీపిస్తోంది.

మాలతి కళ్ళు వెతుకుతున్నాయి. థర్డ్ ... థర్డ్ ... థర్ ... ఇంటర్ ... సెకండ్ ... సెకండ్ ... కంపార్టుమెంటులో గేట్ దగ్గిర ఓ వ్యక్తి నిలబడివున్నాడు. మాలతి సంతోషంతో జేబురుమాలు వూపింది. అతను చెయ్యి ఆడించాడు. దీపాల వెలుగులో అతని చేతికిగల రేడియం డయల్ రిస్ట్‌వాచ్ తళుక్కుమని మెరిసింది. అతను మాలతివైపు చిరునవ్వు నవ్వాడు. ఆమె హృదయం రైలుతో సరిసమానంగా పరిగెత్తింది. రైలాగితే బావుండును. అనుకుందామె. కాని తనకోసం రైలాగుతుందా. ఎవరైనా గొలుసు లాగితే ... ఎవరో యెందుకు? సుందర్రావే లాగకూడదా? సుందర్రావు ... సుందర్రావు ఆగడు. తనకోసం యెవరూ ఆగరు. ఆమె దీనంగా అతనివైపు చూస్తూ నిలబడ్డది. దీపాల వెలుగులో అప్పుడప్పుడు తళుక్కుమని మెరుస్తూ ఆ రేడియండయల్ రిస్ట్‌వాచ్ అదృశ్యమైపోయింది క్రమంగా.

రిస్ట్‌వాచ్.

రిస్ట్‌వాచ్ పేరువింటే తనకి సుందర్రావూ, సుందర్రావు పేరువింటే రిస్ట్‌వాచీ జ్ఞాపకం రావటం పరిపాటి.

ఇరవై నాలుగు గంటలూ ఆ వాచ్ అతనిచేతికి ఉండాల్సిందే. స్నానం చేసేటప్పుడుకూడా తియ్యడు. తమాషా మనిషి సుందర్రావు. అతని మనస్తత్వం యేమిటో తనకి ఇప్పటికీ సరిగా అర్థంకాదు. గడియారంలోని సెకండ్ల ముల్లులాగా యెప్పుడూ ఎవరో వెంట తరుముతున్నట్లు ప్రవర్తిస్తాడు. క్షణం ఊరికే ఉండడు. అతనితో పరిచయమైన కొత్తలో తనకి ఆశ్చర్యం వేసేది. ప్రతి విషయంలో, ప్రతిదానికీ అతి తొందర పడతాడు. ఏమిటో మించిపోతున్నట్టుగా... ఒక్కరోజు వుండి పొమ్మంటే అతి జరూరుగా పోవాలని యెక్కడికో పారిపోతున్నాడు. ఏమిటో అంత జరూరు.

తన కలువంటి జరూరు పనులేమీ వుండవేం? ఆ మాటకొస్తే యెవరికీ వుండవేమో. ఎంతమంది ఉద్యోగాలు చెయ్యటంలేదు? ఇలా క్షణం తీరిక లేకుండా యెవరూ ఉండరు! ఇంతా యిస్తే, చేసేది లెక్చరర్ ఉద్యోగం. ఏ రెండు గంటలో కాలేజీలో గడిపేది. మిగతా టైంఅంతా ఖాళీయేగా. ఆ మాటంటే సుందర్రావు ఒప్పుకోడు. ఏమిటో చదవాలంటాడు. ఏమిటో ఆ చదివేది. చావు నెరుగలేని చదువేటిచదువయా? అన్నాడు వేమన. ఆ చదవటంకూడా నిమిషాలు గంటల ప్రకారం చదువుతాడు. అసలు అతను చేసే ప్రతి పని అంతే. ఫలానా టైంకి ఫలానా పని ఫలానా నిమిషాల్లో లేక గంటల్లో చెయ్యాలని నిర్ణయించుకుంటాడు. ఆ టైంలోపల పని అయినా కాకపోయినా టకీమని వొదిలేస్తాడు. తమాషా

మనిషి. ఉత్తరాలు చూసుకోటానికి 15 నిమిషాలూ, ఉత్తరాలు రాసుకోటానికి 30 నిమిషాలూ... ప్రపంచంలో ఒక్క సుందర్రావుతప్ప యింకెవరేనా యిలా టైంటేబిల్ ప్రకారం యాంత్రికంగా నడుచుకుంటారా? తనకి ఓ రోజు అసంపూర్తిగా ముగించిన వుత్తరం వొచ్చేదాకా ఈ సంగతి తెలియదు. అతన్నిగురించి యేమనుకోవాలి అసలు సుందర్రావుకి తగిన ఉద్యోగం కాలేజీ లెక్చరర్ కాదు. అతను యే ఫ్యాక్టరీలోనో టైంకీపర్ గానో, లేక వాచ్ డీలర్ గానో, లేకపోతే వాచ్ రిపేరింగ్ గానో వుండాలిసింది.

మాలతికి నవ్వొచ్చింది.

తనకి సుందర్రావుమీద కోపంవచ్చింది. నిజానికి అతని మీద తనకెన్నోసార్లు కోపంవచ్చింది. అతనికి తనమీద ఎప్పుడైనా కోపం వచ్చిందో లేదో.

ఆ రోజు సాయంత్రం బీచ్ లో జరిగింది తలుచుకుంటే నవ్వొస్తుంది. కోపంసంగతి యెలావున్నా, సుందర్రావు పక్కన బీచ్ లో కూచుని యేవేవో కబుర్లు చెప్తుంటే ఎంతసేపైందీ తనకి తెలియలేదు. ఆ చల్లగాలిలో అలలసౌందర్యంలో, మానసికాహ్లాదంతో, తాను పరవశమైపోయింది. సుందర్రావు మాత్రం తనరిస్టువాచీసంగతి మర్చిపోలేదు. సెకండ్లు, నిమిషాలతోసహా లెక్కపెట్టి "ఏడుగంటలయింది. పోదాంపద..." అన్నాడు. ఆ వాతావరణంలో అంతఅకస్మాత్తుగా సుందర్రావుతప్ప అలా యెవరేనా అనగలరా. తన

కేమనాలో తెలియలేదు. కొంచెం కోపంవచ్చింది. "ఇప్పుడు కూడా రిస్టువాచీ యెలా చూడగలిగారు" అంది విసుగ్గా.

"ఏం...? నాది రేడియం డయల్ రిస్టువాచీ" అన్నాడతను.

తను ఫక్కున నవ్వింది. అతనికి మొదట అర్థంకాలేదు తను ఎందుకు నవ్విందో.

అప్పటినుంచీ అతనికి మారుపేరు పెట్టింది తను రిస్టువాచ్ ...అని. అలా పిలిచినప్పుడల్లా అతను ఓ చిన్ననవ్వు నవ్వేసి ఊరుకునేవాడు.

సుందర్రావునిగురించి సీరియస్‌గా ఆలోచించాల్సిన పరిస్థితికి దారితీసిన సంఘటన ఆ తరువాత కొన్నాళ్ళకి జరిగింది.

ఆ సాయంత్రం సినిమాకి పోదామని ప్రోగ్రాం వేసుకున్నారు. ఆరుగంటల యిరవై అయిదు నిమిషాలకి వొస్తానన్నాడు. ఆరున్నరకి బయల్దేరాలి. అలాగే నిమిషాలులెక్కపెట్టుకుని వొచ్చాడు. ఒక్క అయిదు నిమిషాల్లో తను డ్రస్ పూర్తిచేసుకొని వస్తాననిచెప్పింది. సుందర్రావు స్వతహాగా అందమైనవాడు. ఆ విషయాన్ని అతని నిర్లక్ష్యం యెంత దాచేసినా దాగక బయటపడుతూనేవుంటుంది. అలాంటిసుందర్రావు పక్కన నడుస్తుంటే చూసినవాళ్ళు యీడూ, జోడూ అని మెచ్చుకునేలా తను జాగ్రత్తతీసుకోవద్దా? ఎంతసేపటికీ తన అలంకరణగురించి తనకి తృప్తికలగలేదు. ఆలస్యమైపోతోంది.

నిజమే... కాని తనకిమిగిలిన టైం అయిదునిమిషాలేననే సంగతి తననంతగా బాధించలేదు. తనదృష్టిలో వున్నది సుందరరావుకాని సినిమాకాదు... కాలం అంతకంటేకాదు. కాని సుందరరావు యెంత అనుచితంగా ప్రవర్తించాడు. తను డ్రెస్ వేసుకుని బయటికొచ్చేసరికి అతనక్కడలేడు. టేబిల్ మీద ఓ కాగితం మడిచిపెట్టి వుంది. చదివింది ... ఆరున్నర అయిపోయింది. క్షమించాలి... తను స్తబ్ధురాలై పోయింది. ఏం మనిషి సుందరరావు...

మర్నాడు అతనితో మాట్లాడటానికి తన కేమనస్కరించలేదు. ముభావంగావుంది. అతను కొంచెం బాధపడ్డట్టుగా కనిపించాడు.

"గడిచిన క్షణాలు తిరిగిరావు. అన్నాడు అర్థ స్వగతంగా.

"మరేం యిబ్బందిలేదు." అంది తను కటువుగా.

"ప్రతిక్షణం అమూల్యం అని నీకెప్పుడూ అనిపించలేదా" అని ప్రశ్నార్థకంగా తనవైపు చూశాడు.

"ఎవరికి," ఎదురుప్రశ్న వేసింది తను,

"నీకూ, నాకూ, అందరికీ..." అన్నాడతను.

"అందరికీ కాకపోవచ్చు" అంది తను,

"ఎందుకని." సందేహంగా తనవైపు చూశాడు సుందరరావు.

"ఎవరిక్షణాలు వాళ్ళని" అంది తను.

"అంటే..." అతని అర్థంకాక ప్రశ్నించాడు. తను ఇంకేమీ చెప్పదలుచుకోలేదు.

"అంతే..." అని ఊరుకుంది.

అతను కొన్నిక్షణాలేదో ఆలోచించి. రిస్టువాచ్ వైపు చూసి చిన్నగా నవ్వాడు. తన కసలే వొళ్ళుమండుతోంది. ఎందుకానవ్వు? విసుగ్గా ... "ఆ రిస్టువాచ్‌లో ఏముంది, ఊరికే అలా చూడటానికి" అంది. అతను ముంజేయి ఎత్తి వాచ్ తనకి చూపిస్తూ "ఇందులో ఏం కనిపిస్తోంది?" అని నవ్వుతూ అడిగాడు. తన సహనం పూర్తిగా చచ్చిపోయింది. ఎగతాళిగా అంది.

"ఒకటినుంచి పన్నెండుదాకా అంకెలూ, కనపడని చిన్న చిన్న అక్షరాలూ, ఒక గంటల ముల్లూ, ఒక నిమిషాలముల్లూ, ఒక సెకండ్ల ముల్లూ" అతను మధ్యలోఅడ్డొచ్చి అన్నాడు.

"చాలు, నాటిని గురించి ఆలోచించావా యెప్పుడైనా..."

తను తల ఊపింది.

"అందులో ఏదో తెలుసుకోవాలిసింది ఉన్నట్లుగానీకు తోచలేదా?"

తను మళ్ళీ తల ఊపింది.

"ఏమిటది?" అని అడిగాడతను.

"గానుక" అంది తను:

తెల్లబోయాడతను తరవాత తేరుకుని యేదో చెప్ప బోయి మళ్ళీ ఆగిపోయాడు. ఈ ఆలోచనల్లో మాలతికి తటాలున ఓ విషయం జ్ఞాపకం వొచ్చింది. సుందర్రావు రైల్లో పోతూ తనవైపు ఓసారిచూసి వాచ్ చూసుకున్నాడు. తరవాత తన చేతివైపు చూశాడు. తనకీ రిస్టువాచ్ వుంది. కాని ఆ విషయం అతను గమనించాడో లేదో. సుందర్రావు అభిరుచులకి అనుగుణంగా తను నడుచుకోవాలనే మొదటినుంచీ ప్రయత్నిస్తోంది. కాని అన్ని విషయాల్లో తనది ఆలస్యమే ... ఏమనుకున్నాడో సుందర్రావు.

సుందర్రావుకి అంతా తొందర.

తను అతన్ని అందుకోలేదు.

అతను తనకోసం ఆగడు.

అసలు తనకోసం ఎవరూ ఆగరు.

కాని తను అందరికోసం... అన్నిటికోసం ఆగుతుంది. తను రైలుకోసం యెన్నిసార్లు పడిగాపులు పడలేదు? కాని రైలు తనకోసం ఒక్కసారికూడా ఆగదు.

తన అమాయకపు ఆలోచనకి మాలతికి నవ్వొచ్చింది.

తను అన్నింట్లో అతి నెమ్మదస్తురాలు. గడియారాన్ని చూస్తే తనకి నవ్వొస్తుంది.

ఎందుకో!

ఇద్దరిలో యింత వ్యత్యాసమున్నా తనకి సుందర్రావంటే, సుందర్రావుకి తనంటే యెంతో యిష్టము. తనంటే

యిష్టం లేకపోతే పెళ్ళి చేసుకోటానికి ఎందు కొప్పుకొంటాడు? ఇంకా కొన్ని నెలల్లో తనకు వివాహం అవుతుంది. సుందర్రావు తనకి మరింత దగ్గరవుతాడు.

తను సుందర్రావుకోసం యెన్నో నెలలు ఆగింది. కనీసం ఆరు నెలల్నించీ వాయిదా వేస్తున్నాడు. ప్రతినెలావొస్తానని రాసి ఆశాభంగం కలిగించాడు. బుద్ధిపూర్వకంగా అలా చెయ్యలేదని తనకి తెలుసు. అతను యెప్పుడు బయలుదేరినా రైలు లేటవుతోంది. కోపంవొచ్చి యింటికి వెళ్ళిపోతాడు.

సుందర్రావు రైలు తప్పటం అంటూ లేనే లేదు: రైలే అతనికి మిస్ అవుతుంది.

తనకి సామాన్య విషయమైపోయింది రైలు తప్పటం. అవును. తనకోసం కాలం ఆగదు. పరవాలేదు. కాని తను కాలం కోసం ఆగుతుంది. ఎన్నోసార్లు ఆగింది. తన కది అలవాటైపోయింది.

కాలం.

కాలం అంటే సుందర్రావుకి... సెకండ్లూ, నిమిషాలూ, గంటలూ.

కాని తనకలా కాదు.

ఏవేవో భావాలు, జ్ఞాపకాలు, ఆశలు, ఆలోచనలు, నిట్టూర్పులు, ఆనందోత్సాహాలు యేవేవో మనసులో మెదులుతా యామెకు.

“కాలాన్ని కొలిచేది కేవలం గడియారమేనా?” అని అడిగింది సుందర్రావుని ఎన్నోసార్లు.

అలాంటి ప్రశ్నలకి అతను జవాబుచెప్పడు. తన హృదయంలో యేదో వేదన. మనసులో ఏదో ఆలోచన. ఏమిటో తనకే సరిగా తెలియదు. కాలం అంటే యేమిటో ... అది అందర్నీ భయపెట్టినట్టు తనని భయపెట్టదేం.

అలా ఆలోచనల్లో తేలిపోతున్న మాలతికి ఏదో పెద్ద ధ్వని వినిపించింది. ఆమె అదిరిపడ్డది. తన చుట్టూ యేదో కలకలం బయలుదేరింది. బహుశా రైలు ఢీకొన్న శబ్దం అయ్యుంటుందని చుట్టుపక్కల ఉన్న కొందరు తమ సందేహం వెలిబుచ్చారు. మాలతి ఆ మాట వినీ వినగానే టాక్సీలో ఎక్కి కూర్చుంది. రైలు రోడ్ మీదుగా టాక్సీ పరిగెత్తింది.

చిన్న గూడ్స్‌బండీ అదే లైనుమీద ఉండటంవల్ల ప్యాసెంజరు దాంతో ఢీకొంది. ఐతే ప్రమాదం ఊహించి ముందు జాగ్రత్తపడినందువల్ల ప్రమాదం దాదాపు తప్పిపోయింది. ఇంజన్ పట్టాలుతొలిగింది. ఇద్దరు ముగ్గురు ప్రయాణీకులకి స్వల్పంగా గాయాలు తగిలాయి. మాలతి సరాసరి సుందర్రావు ఉన్న కంపార్టుమెంటు దగ్గరకి వెళ్ళింది. ప్రమాదం జరిగే సమయానికి అతను కొంచెం పరాగ్గా ఉండటంవల్ల — బెర్తునించి పడిపోయాడు. తలకి కొద్దిగా దెబ్బ తగిలింది. మాలతి కంపార్టుమెంట్‌లోకి యెక్కి వచ్చేసరికి అతను తల రెండు చేతుల్లో పట్టుకు కూర్చున్నాడు. ఆ స్థితిలో సుందర్రావుని చూసేసరికి మాలతి హృదయం అర్థమైంది. నెమ్మదిగా అతని చేతులు విడిపించి "బాగా దెబ్బ తగిలింది." అని

జాలిగా అడిగింది. అతను లేదన్నట్టుగా తల తిప్పాడు. ఆ సమయంలో ఆమె అక్కడ ప్రత్యక్షం కావటం అతనికి ఆశ్చర్యం కలిగించింది.

మాలతి యేమో చెబుతోంది. ఎంతసేపు చెప్పినా ఆమె హృదయంలో వేదన, ఆరాటం తీరడం లేదు.

నా కోసం అయినా కాకపోయినా రైలాగింది. మీరాగారు. ఇహ కాలం ఆగకపోయినా పరవాలేదు ...అంది మాలతి తృప్తిగా.

సుందర్రావు వెంటనే గడియారం చూసుకున్నాడు. అది ఆగిపోయింది. అద్దం కొద్దిగా బీటువారింది కూడా.

"అరె, వాచ్ ఆగిపోయిందే. అనేసి తక్షణం దాన్ని విప్పటాని కుపక్రమించాడు. మాలతి అతనివైపు కొంచెం చూచింది. "ఏం? ఆగిపోతే" ఆమె స్వరంలో కోపంస్పష్టంగా కనిపించింది.

"ఎలా?" అని మాత్రం అన్నాడు సుందర్రావు.

"ఏం? ఆగిపోయింది గడియారమే కాని."

ఆమె ఆగింది.

"వూ...కాని..." ప్రశ్నార్థంగా ఆమెవైపు చూశాడు అతను.

"ఇంకేమీ కాదుగా..." ఆమె పూర్తిచేసింది.

అతనేమీ అనకుండా తన పనిలో నిమగ్నుడై పోయాడు:

మాలతి ముఖం యెర్రబడ్డది. ఆమె మనసులో సెకండ్లు నిమిషాలూ, హృదయంలో వేదనలూ, అనుభూతులూ గిర గిర తిరిగాయి.

కొద్ది క్షణాలాగి సుందర్రావు "ఇంకా నయం, అంతగా చెడిపోలేదు" అని తలెత్తి చూశాడు. మాలతి లేదు. పరిస్థితి ఓ క్షణం అర్థంకాలేదతనికి. తలుపుదగ్గిరకొచ్చి చూశాడు: మాలతి చరచర నడిచిపోతోంది. వెంటనే అతనికి పరిస్థితి అర్థమైంది. మాలతి అన్న చివరిమాటలు జ్ఞాపకం వొచ్చాయి అతనికి" ఆగిపోయింది గడియారమే గాని యింకేమీ కాదుగా" మాలతివైపూ రిస్టువాచీవైపు చూడసాగాడు సుందర్రావు. ఆమె వుద్దేశం ఏమిటో...

రిస్టువాచీ ఆగిపోయింది.

మాలతి చకచక వెళ్ళిపోతోంది.

కాలాన్ని కొలిచే సాధనం పని చెయ్యటం లేదు. టైమెంతైందో...

మాలతి దగ్గర వాచ్ ఉంది.

ఆమెని అడగాల్సింది.

"ఎంతైతేనేం" అనేదేమో.

అవును యెంతయితే ఏం? సెకండ్లూ నిమిషాలూ గడిచిపోతే ఏం? క్షణాలు గడుస్తున్నాయి. వాచ్ పని చెయ్యటంలేదు. మెదడుకూడా పనిచెయ్యడంలేదు. మాలతి చకచక నడిచిపోతోంది. వాచ్ మాత్రం ఆగిపోయింది. వాచ్ పనిచేస్తే మాత్రం ఏం లాభం యిప్పుడు. ఇప్పుడు రైలు కద

లదు. కాలం ఇంత నెమ్మదిగా నడుస్తోందేం. అసలు నడవటం లేదల్లే ఉంది. అందుకే వాచ్ ఆగిపోయిందా? సుందర్రావుకి నవ్వొచ్చింది.

వాచ్ చెడిపోయింది. అది కాలాన్ని కొలవలేదు.

తనకి యేమిటో అశాంతిగా ఉంది. మాలతి యెందుకో అలా వెళ్ళిపోతోంది. చప్పున అతనికి మాలతి మాటలు జ్ఞాపకం వొచ్చాయి. దూరంగా మాలతి... దూర దూరంగా.

ఆ మరుక్షణం వెనకనించి యేదో విసురుగా వొచ్చి తన కాళ్ళముందు పడేసరికి చీకట్లో నడుస్తున్న మాలతి ఉలిక్కి పడ్డది. నిదానించి చూసి తళుక్కున మెరిసే ఆ వస్తువుని పోల్చుకుంది. ఆమె ఆశ్చర్యానికి మేరలేదు. అది తన సుందర్రావుకి అత్యంత ప్రియమైన రేడియం డయల్ రిస్ట్‌వాచ్!